# సుశీలా రజస్వలానంతర వివాహము

శ్రీమతి మద్దుల దమయంతీదేవిగారు

రంగారావుగారు కాకినాడదగ్గర గొల్లపాలెమున నివసించుచుండిరి. ఆయన ధనవంతుడగు వైశ్య ప్రముఖుడగుటచే గ్రామమునకంతకును గౌరవప్రదముగ మెలంగుచుండిరి. ఆయన భార్య కల్యాణి, భర్త కనురూపయై సహధర్మచారిణి నామమును సార్థకమొనర్చుచుండెను. వారి పెద్దకుమార్తె సుశీల, చిన్నకుమార్తె సువర్ణయు, తల్లితండ్రులవద్ద నల్లారు ముద్దుగ పెరుగుచుండిరి. వారిరువురు పేరునకుతగిన సద్గుణములు, మంచి సౌందర్యముగలవారు. అన్యోన్యమున చాల కలిసి మెలసి తిరిగెడివారు. తల్లిదండ్రుల యందు వినయవిధేయతలుకలవారై చక్కని శ్రద్ధా భక్తులతో విద్యాభ్యాస మొనర్చుచుండిరి.

ఒకదినమున మధ్యాహ్నము భర్త భోజనము చేయుచుండగా, కల్యాణి వంటయింటి తలుపున కొరగనిలిచి, "ఏమండీ! మన సుశీలకు పన్నెండు సంవత్సరముల ప్రాయము వచ్చినది; పెండ్లిమాట యేమైన యాలోచించుచున్నారా, లేదా?" యని ప్రశ్నించెను.

రంగారావు మజ్జిగఅన్నము కలుపుకొనుచు దీర్ఘాలోచనతో "ఆలోచింపకేమి? నేను చేయవలసిన పని చేయుచునేయున్నాను. కాని యిప్పు డేమంత తొందరవచ్చినది? అయినను యిప్పుడు వివాహము చేయుటకు శారదాచట్ట మొకటి అమలులోనికి వచ్చినది. పదునాలుగు సంవత్సరములు వచ్చినగాని వివాహముచేయుట కెంతమాత్రము వీలులేదు" అనుచు మెల్లగ తప్పించుకొనజూచెను. కాని కల్యాణి యంతతో నూరుకుండునదియా?

"సరే, మీ రిట్లే చెప్పుచు కాలముగడుపజూచుచున్నారు. పన్నెండు సంవత్సరములు వచ్చినవి, యింకను చాలదా? పదునాలుగు సంవత్సరములు వచ్చుదనుక నే నుంచజాలను—ఇంతవరకు వచ్చువప్పటికే నాకు చాల కష్టముగనున్నది. ఇక నొకటి రెండేండ్లలో నమ్మాయి రజస్వలయగును. 'లోకులు కాకు'లని మనలను కులమునుండి వెలివేతురు. అందువలన మనకు తీరని యవమానముకలుగును. మన గృహమున కితరు లెవరును రారు. మనల నెవ్వరు పిలువరు. ఏది యెటులున్నను ముందు వారికి భయపడవలసివచ్చుచున్నది. కాన మంచివరుని వెదకి త్వరలోనే మన సుశీలకు వివాహముచేయవలెను" అని యామె చిన్న యుపన్యాస మిచ్చునప్పటికి రంగారావునకు కొంచెము కదలికపుట్టెను. అయిన యాలస్య మెట్లైననయ్యెను, కావున కల్యాణి బుర్ర తిప్పనిదే యీవేళ విస్తరిముందునుండి లేవకూడదని యాతడు దృఢనిశ్చయ మొనర్చుకొనెను. మొదట నామెపై లేనిపోని కోపము తెచ్చుకొని యిట్లు ప్రారంభించెను.

"ఏమిటీ గొడవ? భోజనముదగ్గిరనేనా? దీనికి మరిసమయము దొరకలేదా? ఇదిగో, చూడు. నే నొకటేమాట చెప్పుచున్నాను. ఈ రోజులలో నెక్కడ చూచినను రజస్వలానంతరవివాహములు నిర్భయముగను, మిగుల నుత్సాహముతోను జరుగుచున్నవి. బ్రాహ్మణులుకూడ నిరాఘాటముగ నిట్టి వివాహములు చేయించుచుండ, నింకను నీవు భయపడుచున్నావా? 'వారు వెలివేతురు, వీరు నిందింతురు' అను భయమెందుకు? 'మన యంతరాత్మ కనుకూలమా, కాదా'యను సంగతి యాలోచింపవలెను. నిజముగ స్త్రీలు విద్యావిహీనులగుటచేతనే యిట్టి మూఢాచారములకు లోనైనారు. ధనమునకాశించి, యేమియు నెఱుంగని పసిపాపలకు ముక్కుపచ్చలారని వయస్సులోనే, యే ముసలివానికో లేక యే రెండవ పెండ్లివానికో యిచ్చి ముడివేయుచున్నారు. ఇక నా బాలిక పదవయేటనే రజస్వల

యగును. పదునొకటవయేటనే యమ్మాయిని అత్తవారింట కాపురముచేయుమని పంపెదరు. పాప మా బాలిక విద్యావతికాదు.—చిన్నతనము—కాపురమేవిధముగ దిద్దుకొనవలెనో, పతిసేవ యేవిధముగ చేయవలయునో తెలియదు. ఇక వెళ్లినది మొదలు అత్తగారు మంచి గుణవతియైన సరే—లేనిచో నామె యా బాలికను పెట్టు కష్టములు యిన్నియని వర్ణింప నలవిగాదు. ఇదిగాక రెండవవైపున నాడుబిడ్డల సాధింపులు. ఇక భర్తస్థితి చూడవలెను. అతని కొకవైపున భార్య, మరియొకవైపున తల్లి. ఎవరినేమనిన యెవరికి కష్టమోయని సమాధానము చెప్పజాలక యిద్దరిమధ్య నలిగిపోవును. ఆసమయమున పాపము సరళస్వభావయగు నా బాలిక హృదయము దుఃఖాగ్నిలో నెంత కుమిలిపోవునో యెవరు చెప్పగలరు? 'బాల్యమున విద్యచెప్పింపక, యేమియు తెలియని దినములలో వివాహమొనర్చుటచేతనేకదా నే నీ యకూపమునబడి యిన్నికష్టములపాలు కావలసివచ్చినది'అని దీర్ఘవిచారముచే కృశించిపోవును. ఈ సంగతి తెలిసి యామెతల్లిదండ్రులు ఆమెపడు కష్టములన్నిటికి తామే కారకులమని మిగుల పశ్చాత్తాపపడెదరు. చిన్నతనముననే సంతానవతులగుటచే, వారిని సవరించుకొనజాలక, యిల్లు సరిగా దిద్దుకొనజాలక, యెవరిమీది కోపమునో ఆమె తన బిడ్డలపైన చూపసాగును. తెలిసినదా, చిన్నతనమున కాపురముచేయుచున్న బాలికల దుస్థితి యీవిధముగనున్నది. ఇక భర్త చనిపోయిన బాలికలగతి చెప్ప నవసరములేదు. కనుక, బాగుగ ఆలోచించుకొనుము. మన బాలికల కున్నతవిద్య నేర్పించి, పదునైదు వత్సరములు వచ్చినతరువాత, వారికి నచ్చిన వరులనుచూచి వివాహముచేయుదము. 'పెద్దవారైనతరువాత వివాహముచేసినమాత్రము కష్టములేరావా'యని నీవడుగుదువేమో, వారు జ్ఞానము తెలిసినవారు, విద్యావతులు గావున నప్పుడు కష్టముల తప్పించుకొనగలనేర్పు వారికి కలుగును. ఒకవేళ కష్టములు వచ్చినప్పటికిని వాటిని ధైర్యముతో సహించగల్గుదురు. అదిగాక, వారంతటవారు, స్వయముగ ప్రేమించి చేసుకొనిన భర్తయేగాన, నెన్నికష్టములు వచ్చినను తల్లిదండ్రుల నిందింపవలసిన యగత్యము లేదు. లోకమున నీవిధమగు వివాహము లెన్నియో జరుగుచున్నవి."

రంగారావు తన లెక్చరు పూర్తిచేయునప్పటికి తాను భోజనముచేయుచున్న సంగతి జ్ఞాపకము వచ్చెను. "అబ్బ! ఎంతయాలస్యమైనది?" అని యొకదీర్ఘముతీసి కాళ్లుచేతులు కడుగుకొనిపోయి ఒక కునుకుతీసెను. తరువాత లేచి మెల్లిగ ఆఫీసునకు జేరుకొనెను. ఈ విధముగ రంగారావు కల్యాణుల మధ్య కుమార్తెల వివాహవిషయమున ప్రతిదినము వాదప్రతివాదములు జరుగుచుండెను. రంగారావు ఆమె హృదయమున కెక్కునట్లుగ, వివిధములగు సాంఘికవిషయములగూర్చి యాధునికపద్ధతులతో చర్చింపసాగెను. ఎట్లైనను కల్యాణి బుద్ధిమతి, యాలోచనాపరురాలు, క్రమక్రమముగ కల్యాణికి రోజుజరిగెడి యీచర్చలవలన, మంచిచెడ్డలు, సుఖదుఃఖములు తెలియసాగెను. కాలక్రమమున మనసు పూర్తిగ పరివర్తనము పొందెను. చివరకు భార్యభర్తల యభిప్రాయ మొకటేయయ్యెను. స్త్రీజాతి యున్నతినందుట లోకమున కెంత శ్రేయస్కరమో యామె గుర్తింపగల్గెను. అప్పటినుండి యామె తన బాలికల భావిసౌఖ్యమునకై వివిధముల ప్రయత్నింపసాగెను.

## ౨

సుశీల సువర్ణలు యింటివద్దనేయుండి యమితోత్సాహముతో విద్యాభ్యాసమొనర్చుచుండిరి. ఆంధ్రము, ఆంగ్లము యిదివరకే చదువుచుండిరి. ఇప్పుడు రాష్ట్రభాషయగు హిందీనికూడ చక్కగ నేర్చుకొనసాగిరి. సుశీల స్కూలుఫైనలు ప్యాసయినది. హిందీలో నున్నతపరీక్షయగు 'రాష్ట్రభాష'కు చదువుచున్నది. ఇద్దరు సోదరీమణులును సంగీతమున చక్కని పాండిత్యము సంపాదించిరి. ఒకరు వీణవాయించుట

యందును, మరియొకరు ఫిడేలువాయించుటయందును మిక్కిలి కృషిసల్పుచుండిరి. సుశీల వీణవాయించుచు త్యాగరాజకీర్తన పాడినదన్న మోడులు చిగుర్చవలసినదే. ఆ చక్కని కంఠస్వరము, సన్ననివంపులు తిరిగిన ఆవేళ్లతో తీగెలమీటుట, వీణపై చాకచక్యముతో వేళ్లనట్టె పరుగెత్తించుట, యివన్నియు చూచినవారు మంత్రముగ్ధులైపోవుదురనుటలో సందేహములేదు. ఆమె యాంధ్రమున చక్కని వ్యాసముల వ్రాయుటలో నత్యంత నిపుణురాలయ్యెను. అప్పుడప్పుడు చిన్నచిన్నకథలనువ్రాసి 'గృహలక్ష్మి'కి పంపుచుండెను. నిరంతర విద్యాగోష్ఠివలన నామె హృదయ మున్నతభావపరిపూర్ణమై, యామె జీవితమునకొక క్రొత్తకాంతి, క్రొత్తమాధుర్యమును కలుగజేసెను. ఆమె శరీరమునందలి యాంధ్రరక్త మొక్కసారిగ యుప్పొంగెను. తనలోని యాంధ్రత్వము నుజ్జీవింపజేసుకొనుటకును దాని నిలబెట్టుకొనుటకు నామె యత్నింపసాగెను. ఆంధ్రనారీమణుల గరిమామయ జీవితమును తన యాదర్శముగ బెట్టుకొని యామె తనచేకాగల యల్పసేవచేయుచు జీవితమును సార్థకపరచుకొనసాగెను. పదునైదేండ్లు నిండునప్పటికే యామె కీర్తిసుగంధమువలె నలుదెసల బర్వసాగెను.

సుశీల రజస్వల యైనప్పుడు కల్యాణి తనహృదయదౌర్బల్యమునకువశయై కొంతభయపడెను. కాని యాహ్వానించిన పేరటాండ్రందరువచ్చి సుశీలను హృదయపూర్వకముగనాశీర్వదించి మంగళహారతుల నిచ్చిరి. ఫలములు తాంబూలములు తీసుకొని కళ్యాణి హృదయమునందలి యనవసరభయమును పోగొట్టిరి. కాని యెవరో యిద్దరు ముగ్గురు పూర్వాచారపరాయణులు మాత్రము రాలేదు.

కల్యాణి మరల పెండ్లిపాట పాడసాగెను. రంగారావు తగినవరుని వెదుకుటకు పూనుకొనెను. మంచి సంబంధము లున్నవని తెలిసినచోటికెల్ల వెళ్ళి పరీక్షించెను. అందరు సుశీల రూప గుణ సంపదలు విన్నవారగుటచే నామె సంబంధమున కెగబ్రాకనారంభించిరి. కాని రంగారావున కేసంబంధము నచ్చలేదు. మద్రాసులో చక్కని సంబంధమొకటి యున్నదని తెలిసి యచ్చటికి కూడ ప్రయాణమయ్యెను.

## 3

రంగారావు తిన్నగా సెంట్రలుస్టేషనునుండి క్రిష్టియన్ కాలేజికి వెళ్లెను. సుదర్శనుడు బి.ఏ. క్లాసులో చదువుచుండెను. చూచీచూచుటతో రంగారావు నాతడాకర్షించివైచెను. ఇరువదియొక్కసంవత్సరము లుండునేమో. మంచిరూపసి. ఉన్నతాశయములు కలవాడు. కాలేజీ కంతకు తలలో నాలుకవలె మెలంగుచు ప్రిన్సిపలుచే కూడ మన్ననల నందినవాడు. ఇక లోటేమున్నది? ధనముకా? అతని తండ్రి రామారావు హైకోర్టువకీలు, మంచిగౌరవనీయుడు, సంఘసంస్కర్త. తనకుమార్తె సోనాబాయినికూడ 'లేడీ విల్లింగ్డన్ కాలేజీ'లో ఉన్నతవిద్యకై చదివించుచుండెను. ఆయన సోనాభాయికి రజస్వలానంతర వివాహము చేయదలంచుటయేగాక తనకుమారుడు సుదర్శనునికి కూడ ఒకరజస్వలయగు కన్యకనిచ్చియే వివాహముచేయ నిశ్చయించుకొనెను.

ఆనాడు సాయంత్రము నాలుగుగంటలకు తన స్నేహితులకూడ వెంటబెట్టుకొని రంగారావు రామారావుగారింటికి వెళ్లెను. మంచిమర్యాదగల కుటుంబము. అదివరకే సుదర్శనునివలన నన్నిసంగతులు తెలిసికొనియుండుటచే రామారావు వచ్చినవారందరిని గౌరవించి కూర్చుండజేసెను.

అందరుకలసి వివాహవిషయము లన్నియు మాట్లాడుకొనుచుండిరి. రంగారావు భువనమోహనకరమగు సుశీలఫొటోను వారికి చూపుచుండెను. ఇంతలో సుదర్శనుడు కాలేజీనుండి తిరిగివచ్చెను. సుదర్శనుడు కూడ ఫొటోనుచూచి ముగ్ధుడైపోయెను. సుందరి యగుటయేకాక విద్యావతి కుండవలసిన సమస్తలక్షు

ణములు నామెయందు మూర్తీభవించియుండుటచే నత డమితానందముతో తన యదృష్టమును కొనియాడసాగెను. తల్లిదండ్రులుకూడ సంతోషముతో వివాహమునకు తమసమ్మతినిదెల్పిరి. ఈ విధముగ సంబంధమును స్థిరపరచుకొనిరి. సుదర్శనుని తల్లి సుగుణమణి విద్యావతియేకాక పతివలెనే నూతన భావములుకలది. చదువుకొనిన చక్కనికోడలు రానున్నదని యామె కూడ మిగులసంతసించెను. ఇక సుదర్శనుడు యెప్పుడువెళ్లి సుశీలను దర్శింతునాయని యువ్విళ్లూరసాగెను. మఱునాడే అందరుకలసి గొర్లపాలెమువచ్చి తాంబూలములు పుచ్చుకొనిరి. పెండ్లికొడుకువారు, లగ్ననిశ్చయముచేసుకొని వెళ్లిపోయిరి. ఫిబ్రవరి 26 వ తారీఖున సుశీల పెండ్లిమూర్తమని నిర్ణయింపబడెను. సుదర్శనునివంటి యోగ్యుడగు పతి లభించుటచే సుశీల మిగుల యుత్సాహముతోనుండెను. ఆమె యానందమున కడ్డులేకుండెను:

పెండ్లిపను లతిచురుకుగ సాగుచుండెను. గృహమంతయుశుభ్రపరుపబడి చక్కగ నలంకరింపబడెను. రంగారావు గృహము నిత్యకళ్యాణము పచ్చతోరణముగనుండెను. పెండ్లివాకిలియంతయు, చంటిబిడ్డల యేడ్పులతోడను, ముత్తైదువుల సందడులతోడను, వియ్యపురాలి హడావుడులతోడను కలకలలాడుచుండెను. పిల్లవాండ్ర యల్లరులకు మితిలేదు. కల్యాణి రంగారావులు గ్రుక్కత్రిప్పుకొనక పనిచేయుచుండిరి. సువర్ణ యక్కగారివివాహమని చాలసంతోషముగ నిటునటు తిరుగుచుండెను. ఇంత హడావిడిగా రాత్రి యెట్లోగడిచిపోయెను. ఉదయము తొమ్మిది గంటలగునప్పటికే మేళతాళములు మ్రోగసాగినవి. బ్రాహ్మణబృందమేతెంచినది. సుశీల, సుదర్శనులు మంగళస్నానములొనర్చి నూతన వస్త్రధారులై పెండ్లి పీటలపైగూర్చుండిరి. పెండ్లి పందిరంతయు, బాలురతోను, వృద్ధులతోడను, స్త్రీలతోను, యువకులతోడను, నిండి కిటకిటలాడుచుండెను. గొర్లపాలెము పల్లెటూరేయైనను, యాగ్రామమున నిదే మొదటి వివాహమగుటచే యితరగ్రామములనుండి కూడ యనేక ప్రేక్షకులువచ్చిరి. ఊరివారందరువచ్చిరి. ఆ కల్యాణమును చూచుటకు చాలమంది సనాతనులు కూడ వచ్చిరి. ఒక్కసారిగ మంగళవాద్యములతోను, బ్రాహ్మణులమంత్రములతోను కల్యాణమంటపము ప్రతిధ్వనించిపోయెను. ఆశీర్వాదములలోను, కవి పుంగవుల పద్యరత్నములతోను, ప్రేక్షకుల ప్రశంసలతోను వివాహ మత్యంతవైభవముగ జరిగిపోయెను. స్వపక్షవిపక్ష బేధములేక అందరు నా వివాహమున నుత్సాహముతో పాల్గొనిరి. వచ్చిన స్త్రీపురుషులెల్లరు తమతమ యుత్సాహమును వెల్లడిచేసిరి. వివాహము పూర్తియయ్యెను. సుశీల యొకయింటి కోడలయ్యెను. తన బిడ్డకు మంచివరుడు లభించినందులకును, వివాహ మత్యంతవైభవముగజరిగినందులకును కల్యాణి చాల సంతోషించెను. సుశీల వివాహమైనప్పటినుండి యూరిలోని స్త్రీలందరిలో వారివారి బిడ్డలకు రజస్వలానంతర వివాహములే చేయవలయునని కల్యాణి ప్రబోధముచేయ మొదలిడెను.

---

## చిరస్మరణీయురాలు

నందివాడ వెంకటచలపతిరావుగారు

ఉ॥ పూరుష దుర్లభంబయిన భూరిపరాక్రమ శౌర్యలీలలన్
మారిమసంగిన ట్లరులమార్కొని యెల్లెడఁదానెయై గనన్
వీరవిహారముల్ సలిపి, భీకరసంగరరంగమం దభ
శ్చారులుమెచ్చి సన్నుతులుసల్పగ గీర్త్యవశేషయయ్యె వి
స్తారయశోరమంగనిన "ఝూన్సి"చిరస్మరణీయురాలగున్॥